'కుట్టుమిషన్ల'కు వీడని గ్రహణం

- మూలకు చేరిన వంద కుట్టుమిషన్లు
- మాజీ సీఎం కేసీఆర్ బొమ్మే కారణమా?
- ఎదురుచూస్తున్న లబ్ధిదారులు


ఎంపీడీఓ కార్యాలయంలో నిలువ ఉంచిన కుట్టుమిషన్లు..

అశ్వారావుపేటరూరల్: నిరుపేద మైనార్టీ మహిళల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఉచిత కుట్టుమిషన్ పథకాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ పథకంలో భాగంగా అశ్వారావుపేట నియోజకవర్గంలోని లబ్ధిదారులకు అందించేందుకు వంద కుట్టుమిషన్లను మంజూరు చేయగా.. ఆయా కుట్టుమిషన్లను మైనార్టీ కార్పొరేషన్ ద్వారా స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి చేరాయి. వీటిని గతేడాది జూలై నాటికే అందుబాటులోకి తీసుకురాగా, లబ్ధిదారుల ఎంపిక ఆలస్యం కావడం, ఆపై అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులోకి రావడంతో వాటిని పంపిణీ చేయడం సాధ్యం కాలేదు. అయితే, అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా, బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన కుట్టుమిషన్ల పథకానికి బ్రేక్ పడింది. ఆ నాటి నుంచి కుట్టుమిషన్లు పంపిణీకి గ్రహణం ఏర్పడగా, స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోనే మూలనపడ్డాయి. గడిచిన పదిహేను నెలలుగా నిరుపేద మైనార్టీ మహిళా లబ్ధిదారులు కుట్టుమిషన్ల కోసం పడిగాపులు పడుతున్నారు. వీటి గురించి అధికారులకు, ప్రజాప్రతినిధులకు కనీసం పట్టడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

కేసీఆర్ బొమ్మే కారణమా..?

గత ప్రభుత్వ హయంలో ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన ఉచిత కుట్టుమిషన్ల పథకంలో భాగంగా లబ్ధిదారులకు అందించేందుకు అందించిన కుట్టు మిషన్లపై మాజీ సీఎం కేసీఆర్ ఫొటో ముద్రించారు. ప్రతి కుట్టుమిషన్‌పై కేసీఆర్ బొమ్మ ఉండటంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటిని లబ్ధిదారులకు అందించకుండా పక్కన పెట్టినట్లు విమర్శలు వస్తున్నాయి. లబ్ధిదారులకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తే ఈ ప్రయోజనం బీఆర్ఎస్ ఖాతాలోకే వెళ్తుందనే భావనలో ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తంగా రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ద్వారా అందించే కుట్టు మిషన్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా తీవ్ర జాప్యం చేయడం పట్ల లబ్ధిదారులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చొరవ తీసుకొని కుట్టు మిషన్లను పంపిణీ చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆదేశాలు వస్తే పంపిణీ చేస్తాం..



గత ప్రభుత్వ హయంలో నిరుపేద మైనార్టీ మహిళల కోసం వంద కుట్టు మిషన్లను మంజూరు కాగా.. వాటిని మైనార్టీ కార్పొరేషన్ ద్వారా స్థానిక కార్యాలయానికి అందించారు. కాగా, వివిధ కారణాలతో కుట్టుమిషన్ల పంపిణీ ఆలస్యమైన మాట వాస్తవమే. కుట్టుమిషన్ల పంపిణీ గురించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. మరోసారి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తా.
– ప్రవీణ్ కుమార్, ఎంపీడీఓ, అశ్వారావుపేట

'నిఘా' అవగాహన వారోత్సవాలు


ర్యాలీ నిర్వహిస్తున్న బీటీపీఎస్ అధికారులు, సిబ్బంది

మణుగూరురూరల్: మండల పరిధిలోని చిక్కుడుగుంట ప్రాంతంలో ఉన్న మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో మంగళవారం నిఘా అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ఈ వారోత్సవాలను బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్న ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. తొలుత ప్లాంట్‌లో నిఘా అవగాహన వారోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో కుల వ్యవస్థ పెరిగిపోతోందని, దానిని నిర్మూలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ డీఎస్పీ నరేష్, ఎస్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ తిరుపతి, సివిల్ ఎస్ఈ రమణ, అడ్మిన్ ఎస్ఈ పార్వతి, స్టేజ్–1 ఎస్ఈ శ్రీనివాసరావు, సేఫ్టీ డీఈ ఆనంద్ ప్రసాద్, అడ్మిన్ డీఈ మురళీకృష్ణ, అకౌంట్స్ సిబ్బంది, ఎస్‌పీఎఫ్ సిబ్బంది, ఓఅండ్ఎం సిబ్బంది, సేఫ్టీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన


అశ్వారావుపేటరూరల్: ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

అశ్వారావుపేటరూరల్: క్యూబా ప్రజలకు ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ కోరారు. మంగళవారం అశ్వారావుపేట హమాలీ అడ్డా వద్ద క్యూబాకు వ్యతిరేకంగా అమెరికా విధించిన వాణిజ్య ఆర్థిక విధానాన్ని వెనక్కి తీసుకోవాలని ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్మికులు నాగేంద్ర, ఏసు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

దమ్మపేట: క్యూబాకు వ్యతిరేకంగా వాణిజ్య, ఆర్థిక పరమైన ఆంక్షలు విధిస్తున్న అమెరికా తీరు సరికాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో క్యూబా దేశంపై అమెరికా అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను ఖండించారు. నిరసనలో మంగ, ఈశ్వరమ్మ, వెంకటమ్మ, పార్వతి, కాంతమ్మ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులు మండల విద్యా వనరుల కేంద్రం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం ఎంఈఓ కార్యాలయంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

క్లుప్తంగా

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


ధన్వంతరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆయుర్వేద వైద్యులు

మణుగూరురూరల్: వ్యాధులపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ పావని సూచించారు. ధన్వంతరి జయంతి సందర్భంగా మంగళవారం మండలంలోని టీజీటీడబ్ల్యూఆర్‌జేసీ (బాలికల) కళాశాలలో ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ధన్వంతరి చిత్రపటానికి పావని పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థిని ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థినులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వి.రాణి, అశ్వాపురం ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ జి.అరుణ, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ డాక్టర్ పి.మహేష్‌గౌడ్, ఫార్మసిస్ట్ జి.వీరయ్య, ఎస్‌సిఎస్ బి.విజయ్‌కుమార్, ఎస్ఎన్ఓ జి.రాధిక తదితరులు పాల్గొన్నారు.

మృతికి కారకులను అరెస్టు చేయాలి

చర్ల: భద్రాచలం పట్టణంలోని ఓ హోటల్ పని చేసే దళితుడు నర్సింహారావు మరణానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కారకురాలైన మేనేజర్‌ను తక్షణమే అరెస్టు చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల తిరుపతి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కలివేరులో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. హోటల్‌లో గత 12 సంవత్సరాలుగా రోజువారీ కూలీగా పని చేస్తున్న ఇసంపల్లి నర్సింహారావును.. అగ్రవర్ణ కులానికి చెందిన ఆ హోటల్ మహిళా మేనేజర్ కుల అహంకారంతో వేధింపులకు గురి చేసిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే తీవ్రమైన ఒత్తిళ్లకు గురై నర్సింహారావు మృతి చెందినట్లు తిరుపతి వెల్లడించారు. తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మజ్జూరి సత్యనారాయణ, బాసిపోగు గంగయ్య, సూదుల వెంకటేశ్వర్లు, చెన్నం సాంబశివరావు, పూసా నర్సయ్య, పూసా గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు అందజేత

పినపాక: వలస ఆదివాసీ గ్రామాలైన సుందరయ్య నగర్, ఎర్రకుంట యువకులకు పోలీసుల ఆధ్వర్యంలో సీఐ వెంకటేశ్వర్లు మంగళవారం వాలీబాల్ కిట్లు అందజేశారు. ఆదివాసీ యువత చెడుదారులు ఎంచుకోకుండా చక్కరమైన మార్గాలు నడవాలని ఆశిస్తున్నామన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక శక్తులు గ్రామాల్లోకి ప్రవేశిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాజకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

దాడులపై చర్యలు తీసుకోవాలి

చర్ల: జర్నలిస్టులపై దాడులకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ చర్ల మండల కార్యదర్శి కొండా కౌశిక్ డిమాండ్ చేశారు. మంగళవారం చర్లలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో జర్నలిస్టులపై కొందరు కావాలనే దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. ఇటువంటి దాడులకు మొదట్లోనే చెక్ పాడితే దాడులు పెరగకుండా ఆగుతాయని, ఆ దిశగా ప్రభుత్వం, పోలీసుశాఖ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ములకలపల్లి: విద్యారంగ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ సభ్యుడు రాంచరణ్ డిమాండ్ చేశారు. ఈమేరకు సంఘ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్‌ను ముట్టడించారు. తహసీల్దార్ గుడ్ల పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, జూనియర్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

స్వీట్ బాక్సుల పంపిణీ

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పనిచేస్తున్న ఎస్అండ్‌పీసీ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు కాంట్రాక్టర్ మురళీ మ్యాన్ పవర్ ఏజెన్సీ ఆధ్వర్యంలో దీపావళి సందర్భంగా స్వీట్ బాక్సులు పంపిణీ చేశారు. మంగళవారం సూపర్‌వైజర్లు జీఎం కార్యాలయ ఆవరణలో గార్డులకు అందించారు. సూపర్‌వైజర్లు సుధాకర్, రామవతార్, రబ్బానీ, సీనియర్, జూనియర్ సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట


మణుగూరుటౌన్: డ్వాక్రా సంఘాలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని కృష్ణసాగర్, ముసలిమడుగు గ్రామపంచాయతీల్లో రూ.30లక్షల వ్యయంతో నిర్మించిన ఐదు సిమెంట్ కాంక్రీట్ రోడ్లను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను తొందరలోనే ప్రారంభిస్తామన్నారు. పలువురు స్థానిక సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జమలారెడ్డి, డీఈ వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ నాయకులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బాదం రమేష్‌రెడ్డి, మందా నాగరాజు, బట్టా వెంకన్న పాల్గొన్నారు.

కుట్టుమిషన్ కేంద్రం ప్రారంభం..

మణుగూరుటౌన్: మండల స్థాయి కుట్టు మిషన్ కేంద్రం ప్రారంభోత్సవానికి మంగళవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అతిథిగా హాజరయ్యారై ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని 14 డ్వాక్రా సంఘాలకు రూ.1.53 కోట్ల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రుణం పొందిన డ్వాక్రా సంఘాల సభ్యులు చిరు వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా, సామాజికంగా బలపడాలని, శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు.

చేప పిల్లల పంపిణీ..

ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం జిల్లా మత్స్యశాఖ అధికారి ఇంతియాజ్ అహ్మద్ ఖాన్, జిల్లా మత్స్యశాఖ చైర్‌పర్సన్ బుచ్చయ్యతో కలిసి ఎమ్మెల్యే చేపపిల్లలను పంపిణీ చేశారు. మండలంలోని 28 మత్స్యకార సొసైటీల సభ్యులకు 35–40 మిల్లీమీటర్ల సైజుగల 1,62,750 చేప పిల్లలను అందజేశారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అంతకుముందు 100 పడకల ఆస్పత్రిలో ఇందిర మహిళ స్త్రీ శక్తి క్యాంటీన్‌ను రిబ్బన్ కట్ చేసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ట్రైనింగ్ ముగించుకున్న వర్కర్లకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం మణుగూరు పీహెచ్‌సీ ఆస్పత్రికి ఆకస్మికంగా తనిఖీ చేసి పేదలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని అక్కడి సిబ్బందికి సూచించారు. ఫార్మాసిస్ట్ విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం పట్ల ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధికారులు తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏపీఎంఓ అబ్దుల్లా, సూపరింటెండెంట్ సునీల్, ఎంపీఓ వెంకటేశ్వరరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పీరినాకి నవీన్, శివ సైదులు, సామాశ్రీనివాసరెడ్డి, గణేశ్‌రెడ్డి, గుడిపూడి కోటేశ్వరరావు, గాండ్ల సురేశ్, రహీం, పెనుగొండ సాంబశివరావు, జగన్, తదితరులు ఉన్నారు.

బస్‌పాస్‌లు అందజేత

ములకలపల్లి: మండలపరిధిలోని దివ్యాంగులకు సత్తుపల్లి ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. ములకలపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బత్తుల అంజి ఆర్థికసాయంతో 194 మంది దివ్యాంగులకు ఎస్సై కిన్నెర రాజశేఖర్, సత్తుపల్లి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి చేతుల మీదుగా బస్‌పాస్‌లను అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, సురభి రాజేశ్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన వివాహిత గత రెండు రోజులుగా కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు సమీప బంధువుల వద్ద ఆరా తీసినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో భర్త నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులు మహిళ అదృశ్యం కేసును నమోదు చేశారు.

చేప పిల్లలు పంపిణీ

సాక్షి ఎఫెక్ట్..


కరకగూడెం: చేప పిల్లలను అందజేస్తున్న దృశ్యం

కరకగూడెం: మండలంలోని చెరువులు, కుంటలు భారీ వర్షాలతో నిండినప్పటికీ మత్స్యశాఖ అధికారులు చేప పిల్లల పంపిణీలో జాప్యం చేస్తున్నారనే విషయాన్ని తెలియజేస్తూ మంగళవారం 'సాక్షి'లో 'ఇంకా మీన మేశాలేనా'అనే కథనం ప్రచురించగా సంబంధిత శాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో మండలంలోని 16 గ్రామ పంచాయతీ పరిధిలోని 28 చెరువులకు 2,19,750 చేప పిల్లను ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శుల సమక్షంలో మత్స్యకారు సొసైటీలకు అందజేశారు. అయితే గతంలో 100 శాతం చేప పిల్లను ఇస్తే ఈ సారి మాత్రం 50శాతం చేప పిల్లను ఇవ్వడంపై పలువురు పెదవి విరుస్తున్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్ ఎస్.కోటేశ్వరరావు, అసిస్టెంట్ భార్గవ సాయి కుమార్, ఫీల్డ్ మ్యాన్ సీహెచ్.కృష్ణ, మాజీ సర్పంచ్ పోలెబోయిన తిరుపతయ్య, కాంగ్రెస్ నాయకులు ఎర్ర సురేష్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం


అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్ట్ మేనేజర్ సాగర్‌రెడ్డి

మణుగూరురూరల్: ది గాడ్ థెరిస్సా మహిళా మండలి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మణుగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ వట్టి సాగర్ రెడ్డి మాట్లాడుతూ.. హెచ్ఐవీ సోకే మార్గాలు, నివారణ చర్యల గురించి వివరించారు. హెచ్ఐవీ సోకిన వారి పట్ల వివక్ష చూపకూడదని, ఎవరైనా వివక్ష చూపితే 2017యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరికైనా ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే 1097కు ఫోన్‌చేసి సలహాలు, సూచనలు తీసుకోవచ్చని, వివరాలు వ్యక్తి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ వర్కర్ ఎం.రజిని, నాగభూషణం, ఏఎన్ఎం, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం


పరీక్షలు చేస్తున్న వైద్యులు..

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సాయిరాం హాస్పిటల్ వారి సౌజన్యంతో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. హాస్పిటల్ వైద్యులు డాక్టర్ వెంకటనారాయణ, డాక్టర్ నరేష్‌లు వివిధ రుగ్మతలతో బాధపడుతున్న వారిని పరీక్షించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎడారి రమేష్, మాజీ సొసైటీ డైరెక్టర్ సరెడ్డి పుల్లారెడ్డి, మాజీ సర్పంచ్ బాడిశ సతీష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యశోద, సాయిరాం హాస్పిటల్ వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శి అశోక్, నోముల రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాలిపేరు ఆయకట్టు రైతులతో నేడు సమావేశం

దుమ్ముగూడెం: తాలిపేరు ప్రాజెక్టు కింద సాగు చేస్తున్న ఆయకట్టుదారులతో బుధవారం ఉదయం 10.30 గంటలకు, సత్యనారాయణపురం రైతువేదికలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తాలిపేరు అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరు అవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని తాలిపేరు ప్రాజెక్టు ఆయకట్టుదారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రేపు ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు

ములకలపల్లి: ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఎండి.యూసఫ్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని హమాలీ అడ్డా మంగళవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. హమాలీ యూనియన్ కార్యాలయం వద్ద సంఘ జిల్లా కార్యదర్శి నరాటి ప్రసాద్ ఆధ్వర్యంలో రేపు (గురువారం) నిర్వహించే వేడుకలకు కార్మిక లోకం తరలి రావాలని కోరారు. హమాలీ వర్కర్స్ యూనియన్ సంఘ మండల అధ్యక్షుడు నకిరకంటి పుల్లారావు, ప్రధాన కార్యదర్శి మిరియాల వెంకటేశ్వర్లు, వేమల చాణక్య, ఎనిగండ్ల రంగారావు, జలగం సాగర్, పసుపులేటి వెంకటేశ్వర్లు, సాయికుమార్, రాము, శివ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణం ఉండాలి

కరకగూడెం: సమాజంలోని నిరుపేదలకు సాయం అందిస్తూ ఎల్లప్పుడూ సేవా గుణంతో ముందుకు సాగాలని కరకగూడెం తహసీల్దార్ నాగ ప్రసాద్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కారం మధు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో 'అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ' భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి జన్మ ఉత్తర నక్షత్రం సందర్భంగా రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్రావు, వైస్ ప్రెసిడెంట్ బూర్ల శ్రీనివాస్, ట్రెజరర్ గుమ్మడవెల్లి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీ చందా మధు, స్థానిక అయ్యప్ప మాలాదారులు తదితరులు పాల్గొన్నారు.

నిరీక్షించి.. నీరసించి..

కరకగూడెం: వారంతా సుదూర ప్రాంతమైన గుండాల మండలం నుంచి కరకగూడెం మండల కేంద్రానికి వివిధ అవసరాల నిమిత్తం మంగళవారం సాయంత్రం వచ్చారు. ఎవరి పనులు వారు చూసుకొని ఇంటికి ప్రయాణం అవుదామని పెద్ద సంఖ్యలో గుండాల నైట్ అవుట్ బస్సుల స్పాట్ వద్దకు చేరుకున్నారు. వారిలో చిన్నా, పెద్ద, ముసిలి వారూ ఉన్నారు. అయితే సుమారు రాత్రి 8గంటల ప్రాంతం వరకు కూడా మండల కేంద్రంలో బస్సు కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. నిరీక్షించి.. నిరసించారు. కొందరు మణుగూరు ఆర్టీసీ డిపోకు కాల్ చేయగా బస్ రావడం లేదని అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు ప్రయాణికులు తెలిపారు. బస్ రానప్పుడు ముందుగా చెప్తే ప్రయాణికులు ఇతర వాహనాల్లో వారి వారి గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఉండేదని, రాత్రి కావడంతో ప్రయాణికులకు ఎటువంటి వాహనాలూ అందుబాటులో ఉండవని అసహనం వ్యక్తం చేశాడు. కాగా ఈ విషయంపై 'సాక్షి' మణుగూరు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్యామ్ సుందర్‌ను వివరణ కోరగా మణుగూరు–గుండాలకు ఉదయం ఒక సారి బస్ వెళ్లి వచ్చిందని రాత్రి వెళ్లే సమయానికి సదరు బస్ కండక్టర్ ఆర్యోగం క్షీణించడంతో బస్ సర్వీస్ ఆపామని తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ సత్యనారాయణ

అశ్వారావుపేటరూరల్: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఏఎస్సై సత్యనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక భగత్ సింగ్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌తోపాటు పలు చోట్ల నూతన చట్టాలు, డయల్ 100, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సైబర్ నేరగాళ్ల మాయలో పడి, ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు.

మునగ సాగుకు ప్రోత్సాహకాలు

బూర్గంపాడు: సన్న, చిన్నకారు రైతులు మునగ సాగు చేసుకుంటే ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోందని ఏడీఏ తాతారావు, ఎంపీడీఓ జమలారెడ్డి అన్నారు. నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. మునగ సాగు చేసే రైతులకు మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం ఎకరాకు రూ 1.10లక్షలు ఆర్థిక సహకారమందిస్తోందన్నారు. మునగ కాయలతో పాటుగా గింజలు, ఆకులకు కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారి బాలయ్య, రైతులు పాల్గొన్నారు.


బూర్గంపాడు: మునగ సాగు ప్రచార పత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు

అశ్వారావుపేటరూరల్: సన్నా, చిన్నకారు రైతులు మునగ, వెదురు పంటలను సాగు చేసి ఆదాయం పొందాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని అనంతారం గ్రామంలోని రైతువేదికలో రైతులకు మునగ, వెదురు పంటల సాగు, సబ్సిడీలు, ఆదాయం గురించి అవగాహన కల్పించి ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం కింద సబ్సిడీపై మునగ విత్తనాలు, వెదురు మొక్కలను అందిస్తామని తెలిపారు. ఏఓ శివరాం ప్రసాద్, ఎంపీఓ సోయం ప్రసాద్, ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వరరెడ్డి, ఈజీఎస్ ఏపీవో రామచంద్రరావు, ఐకేపీ సీసీలు, రైతులు పాల్గొన్నారు.


అశ్వారావుపేటరూరల్: ప్రచార పోస్టర్లను ఆవిష్కరించిన ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్